క్లుప్తంగా

సోలార్ విద్యుత్ పరికరాలు పరిశీలన



పరికరాలు పరిశీలిస్తున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: మండలంలోని పాట్నాపూర్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 13 సోలార్ విద్యుత్ పరికరాలను ఎంపీపీ పెందోర్ మోతిరాం గురువారం పరిశీలించారు. వాటి తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒక ఇంట్లో మూడు బల్బులు, ఒక ఫ్యాన్, టెలివిజన్ దీనిపై నడుస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేయాలన్నారు. విద్యుత్ లైన్ చాలా దూరంగా ఉండడంతోపాటు మీటరు బిగించేందుకు ఆర్థికంగా కొంత ఖర్చు పెట్టడం ఎందుకని భావించిన ఐటీడీఏ అధికారులు పీటీజీలకు వంద శాతం రాయితీపై ఈ పరికరాలను అందించినట్లు తెలిపారు. పీటీజీ సూపర్‌వైజర్ సిడాం ధర్ము, సోలార్ పంపిణీ అధికారులు నివర్తి, సాగర్ ఉన్నారు.

ఎమ్మెల్యే స్పందించారు.. సమస్య తీర్చారు

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ పంచాయతీ అంబగట్టు గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే స్పందించడంతో సమస్య పరిష్కారమైంది. గురువారం బోర్‌వెల్ నిర్మాణ పనులు చేపట్టినట్లు బీఆర్‌ఎస్ నాయకుడు సుధాకర్ తెలిపారు. ఇక్కడకు వచ్చే భక్తులు, ఇతర అవసరాలకు నీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఈ సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దృష్టికి తీసుకెళ్లగా స్పందించి బోర్‌వెల్ మంజూరు చేయించారు.

మోడల్ గృహాల పనులు వేగవంతం చేయాలి



మోడల్ గృహాలను పరిశీలిస్తున్న ఎంపీపీ

కెరమెరి: ఆదిమ గిరిజనుల కోసం మంజూరు చేసిన మోడల్ గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ మోతిరాం అన్నారు. గురువారం ఆయన శివగూడ గ్రామాన్ని సందర్శించి గృహాలను పరిశీలించారు. ఇప్పటికే ఒక గృహం పూర్తయి అందులో నివాసం ప్రారంభించారన్నారు. మిగిలినవి త్వరగా పూర్తి చేయాలన్నారు. పీటీసీ సూపర్‌వైజర్ సిడాం ధర్ము తదితరులు ఉన్నారు.

పంటల వివరాలను నమోదు చేయాలి



వివరాలు నమోదు చేస్తున్న ఏఓ రాజేశ్

కౌటాల: యాసంగిలో రైతులు సాగు చేసిన పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏవో పాలకుర్తి రాజేశ్ అన్నారు. మండలంలోని గుండాయిపేట శివారులోని పంటలను గురువారం ఆయన పరిశీలించారు. క్రాప్ బుకింగ్ యాప్‌లో పంటల సాగు వివరాలను నమోదు చేశారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఏఈవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఓ చౌదరి అంజన్న, రైతులు ఉన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఎదుట గురువారం యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ ఆవిష్కరించారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు, హెచ్‌ఎంలు అరుణ్, నానాజీ, సంఘం నాయకులు ఎం.శ్యాంరావు, ఎన్.శ్రీనివాస్, ఎ.శివాజీ, ఆర్.సునీల్, జయరాం, హరీశ్, తిరుపతి, శేఖర్, అశోక్, గణపతి పాల్గొన్నారు.

పతంగుల పంపిణీ

ఆసిఫాబాద్: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంఐఎం నాయకులు గురువారం పతంగులు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు ఎండీ సల్మాన్ మాట్లాడుతూ తమ పార్టీ హిందూ పండగలు, సంస్కృతిని గౌరవిస్తోందన్నారు. హిందూ, ముస్లింలు సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మీర్ కాఫిక్ అలీ హష్మీ, షకీల్ అహ్మద్, మహ్మద్ పాషా, షేక్ ఆరిఫ్, అజీమొద్దీన్, శైబాజ్ , హెచ్‌ఎం ప్రమీల పాల్గొన్నారు.



దహెగాం చినరాస్పెల్లిలో..



ఆసిఫాబాద్: శిశుమందిర్‌లో..



ఆసిఫాబాద్‌అర్బన్: ఎంపీడీవో కార్యాలయంలో..

స్వామి వివేకానంద జయంతి

జిల్లావ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతిని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పార్టీలు, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల వివేకానంద వేషధారణల్లో ఆకట్టుకున్నారు. వక్తలు మాట్లాడుతూ యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. - సాక్షి నెట్‌వర్క్



కాగజ్‌నగర్‌టౌన్: నివాళులర్పిస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు



కెరమెరి: చిత్రపటానికి పూలమాల వేస్తూ..



రెబ్బెన మండలం గోలేటిలో..



ఆసిఫాబాద్‌రూరల్:నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్



ఆసిఫాబాద్‌అర్బన్: విశాల్ న్యూలుక్ ఆధ్వర్యంలో..



తిర్యాణి: ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తూ..



రెబ్బెన: బహుమతులు అందిస్తున్న లక్ష్మణరావు

'కంటి వెలుగు' పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సౌందర్య

రెబ్బెన: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో రెండవ విడుత కంటి వెలుగు పథకంపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 18 నుంచి మండలంలో ప్రారంభమయ్యే కంటివెలుగు కార్యక్రమానికి అన్ని పంచాయతీల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. కంటిచూపు సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి ఉచితంగా చికిత్స అందేలా చూడాలని సూచించారు. అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో అంజద్‌పాషా, డాక్టర్ రాకేశ్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారి కూపర్ పూజకు ఆహ్వానం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

తిర్యాణి: మండలంలోని గడలపల్లిలో ఈనెల 21న నిర్వహించే పహ్యాండి పారి కూపర్ లింగో కట్ ముట్టి పూజా కార్యక్రమానికి ఎస్పీ సురేశ్‌కుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలో పూజకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఎస్పీ విడుదల చేశారు. కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు గుణవంత్‌రావు, రాయ్‌మేడిలు మోతిరాం, నర్సింగ్‌రావు, తాను, సర్మెడి సుధాకర్, రాజ్‌గోండ్ సేవా సమితి నాయకుడు ఆత్రం భీంరావు, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వర్సస్ పోలీసు క్రికెట్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా యాన్యువల్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర పాఠశాలలో జర్నలిస్టు వర్సస్ పోలీస్‌శాఖతో గురువారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. జర్నలిస్టులు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 8 ఓవర్ల 62 పరుగులు చేయగా, ఎస్పీ సురేశ్‌కుమార్ టీం 7 ఓవర్ల 4 బాల్‌లో లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించారు. ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. జర్నలిస్టులతో ఆడటం సంతోషంగా ఉందన్నారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాణప్రతాప్, కాగజ్‌నగర్ డీఎస్పీ ఎస్సై, సీఐలు పాల్గొన్నారు. కుమురం భీం ప్రింట్, ఎలక్ట్రానిక్ సభ్యులు రవినాయక్, సురేష్, ఖాలీల్, నితేష్, బిక్కాజీ, సతీశ్, జానకిరాం, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ కిట్ అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

రెబ్బెన: యువత క్రీడల్లో రాణించాలని సర్పంచ్ మోర్లె శ్రీనివాస్ అన్నారు. పాశిగాం పంచాయతీ పరిధిలోని యువకులకు గురువారం క్రికెట్ కిట్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో నైపుణ్యాలను పెంచుకుని రాణించాలన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: పద్మశాలీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పట్టణంలోని పద్మశాలి భవనంలో అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి ఆ సంఘం నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వార్షిక డైరీని రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కాగజ్‌నగర్ తహసీల్దార్ ప్రమోద్‌కుమార్, ఎంపీడీవో పరికిపండ్ల శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కుడిక్యాల రాజమౌళి, అనుమాండ్ల కేదారి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

మున్సిపాలిటీలోని ప్రధాన రహదారికి మహర్దశ కలగనుంది. రూ.కోటి వ్యయంతో తెలంగాణ చౌరస్తా నుంచి పొట్టి శ్రీరాములు చౌరస్తా వరకు బీటీ నిర్మాణానికి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల సౌకర్యార్థం బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ గిరీష్, కమిషనర్ అంజయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠరథం ప్రారంభం

మున్సిపల్ కార్యాలయంలో గురువారం వైకుంఠరథాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.18 లక్షల వ్యయంతో ఈ వైకుంఠ రథాన్ని అందుబాటులో తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



శిశుమందిర్‌లో బాలికలతో ఉపాధ్యాయులు



కౌటాల: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో సంక్రాంతి పండగ పురస్కరించుకొని బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాలురకు గాలిపటాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి మాతృమండలి సభ్యురాలు చిప్ప రమాదేవి, కల్లూరి వైష్ణవి, జంజిరాల ఉమ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుండేటి కోటేశ్వర్‌రావు, ఆచార్యులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని గోలేటిలో తపస్వీ ఏజెన్సీ ఆధ్వర్యంలో సంతూర్ సహకారంతో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. గోలేటిలోని భీమన్న స్టేడియంలో ఈ పోటీలను సర్పంచ్ పోటు సుమలత ప్రారంభించారు. ఈపోటీల్లో కృష్ణవేణి ప్రథమ స్థానంలో, సుమలత ద్వితీయ, కొండులత తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని భారతీ విద్యామందిర్ పాఠశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మయూరి విద్యాలయంలో ఈ పోటీలు జరిగాయి. హెచ్‌ఎం దుర్గం సందీప్, కరెస్పాండెంట్ గోపాల్ పాల్గొన్నారు.

హరిత రిసార్ట్ సందర్శన



రిసార్ట్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

నార్నూర్: మంచిర్యాల జిల్లా జన్నారంలో తెలంగాణ టూరిజం హరిత రిసార్ట్ (ఈసీఓ)ను జైనూర్ మండలం మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు, గ్రామస్తులు గురువారం సందర్శించారు. మార్లవాయిలో నూతనంగా నిర్మాణం చేయబోతున్న కాటేజ్ మోడల్ కోసం జన్నారానికి సందర్శనకు వచ్చి పరిశీలించారు. మార్లవాయిలో ఏర్పాటు చేసే కాటేజ్ (గెస్ట్‌హౌజ్)ను పర్యటన కోసం పల్లెటూరు వాతావరణాన్ని ప్రతిబింబేలా ఉండాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఉపసర్పంచ్ జుగ్నాక సావిత్ర దర్మేందర్, గ్రామస్తులు కనక కొద్దు, గెడం గణపత్, లింగు ఉన్నారు.

జంగుబాయి ఆలయంలో పూజలు



మొక్కుతున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నార్నూర్/కెరమెరి(జైనూర్): జైనూర్ మండలంలోని పార గ్రామంలో జంగుబాయి ఆలయంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు గురువారం పూజలు చేశారు. ముందుగా గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ఆవరణలో షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ లక్ష్మణ్ యదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలఖాన్, సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ తదితరులు పాల్గొన్నారు. జైనూర్ వైస్ ఎంపీపీ లక్ష్మణ్ యాదవ్, నాయకులు ఇంతియాజ్‌లాలా, మెస్రం అంబాజి ఉన్నారు.

ఘనంగా జిజియాబాయి జయంతి



దహెగాం: పూలమాలలు వేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్/చింతలమానెపల్లి/దహెగాం/కౌటాల: ఛత్రపతి శివాజీ మాతృమూర్తి జిజియాబాయి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో ఆమె చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు బోట్టుపల్లి జయరాం సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కాజీ, డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు సంతోష్, మారుతి, శ్యాంరావు, బాలకిషన్, రమేశ్, విశ్వనాథ్, శ్రీను, రాజయ్య పాల్గొన్నారు. చింతలమానెపల్లిలోని శివాజీ చౌరస్తా వద్ద నాయకులు నివాళులు అర్పించారు. ఎంపీపీ నానయ్య, నాయకులు పాల్గొన్నారు. కౌటాల, దహెగాంలలో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

'మారని ప్రభుత్వ ఆస్పత్రి తీరు'



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావ్ ఇటీవల సందర్శించినా అధికారులు, ప్రజా ప్రతినిధుల తీరు మారడం లేదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో డీసీహెచ్ ఆసుపత్రి 30 పడకలతో వందల కోట్లతో నిర్మించినా నేటికి ఆసుపత్రిలో ముఖ్యమైన విభాగాలకు వైద్యులను భర్తీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రజా ప్రతినిధులు కేవలం గొప్పలు చెప్పుకోవడానికి కాగజ్‌నగర్‌లో పని చేస్తున్న గైనకాలజిస్ట్‌ను పిలిపించి గత వారం క్రితం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో గర్భిణికి శస్త్ర చికిత్స చేయించారని తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌లో పరికరాలు ఉన్నా ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే ఆసుపత్రిలోని పూర్తిస్థాయి ఖాళీలు భర్తీ చేయడంతోపాటు, కోట్ల రూపాయలతో తీసుకున్న వైద్య పరికరాలను ఉపయోగంలోకి తీసుకరావాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సతీశ్, జాఫర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: జిన్నింగ్ మిల్లు కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఆదుకోవాలని జిన్నింగ్ మిల్లు కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గోగర్ల తిరుపతి కోరారు. స్థానిక జిన్నింగ్ మిల్లులోని కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం భద్రత కల్పించాలన్నారు. పత్తి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు



జిల్లా కేంద్రంలోని దుకాణాలను తనిఖీలు చేస్తున్న రేంజ్ అధికారి అప్పలకొండ

రెబ్బెన/ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ అధికారి అప్పలకొండ అన్నారు. జిల్లా కేంద్రంతోపాటు రెబ్బెనలోని వ్యాపార దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. వ్యాపారులు చైనా మాంజా విక్రయించినా.. నిల్వ చేసినా ఐదు సంవత్సరాలు జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తామని తెలిపారు. మనుషులతోపాటు పక్షులకు హాని జరిగే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం ఆ దారం వినియోగాన్ని నిషేధించిందని పేర్కొన్నారు. ఆయన వెంట అటవీశాఖ అధికారులు సతీశ్, రవి, యోగేశ్, ప్రవీణ్‌కుమార్, అత్తరుద్దీన్, స్వాతి, స్వర్ణలత, ఉషారాణి తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో(రూ.లో)
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	40
టమాట	20
బీరకాయ	40
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంత	40
దొండకాయ	60
మిర్చి	50
సోరకాయ	80
చిక్కుడుకాయ	60
గోబి (ఫూల్)	80
క్యాబేజీ	60

– ఆసిఫాబాద్‌అర్బన్

సినిమాలు

ఆసిఫాబాద్ (కొమ్రంభీం ఏ/సీ): వీరసింహారెడ్డి
కాగజ్‌నగర్ (వెంకటరమణ, ఏ/సీ): వీరసింహారెడ్డి